క్లుప్తంగా

మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మండలంలోని బొంబాయిగూడ, ఎల్కపల్లి గ్రామాల్లో నర్సరీలతో పాటు ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో మొక్కలకు నిరంతరం నీటిని అందించాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్క కూలీకి పనిదినాలను కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీవో సతీష్, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, చంద్రశేఖర్ ఉన్నారు.

గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. శుక్రవారం మండలంలోని లోడుపల్లి గ్రామంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన వారు అధికారులు సూచించిన విధానంలో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

వాంకిడి: మహిళా చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని షీ టీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలల్లో వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్ టీజింగ్‌కు గురైతే వెంటనే షీటీంలను సంప్రదించాలన్నారు. మహిళల వ్యక్తిగత భద్రతకు సంబంధించిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. కార్యక్రమంలో ఎస్సై శిరిష, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఇళ్ల నిర్మాణ పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ శుక్రవారం పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ గ్రామస్తులు మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా గ్రామంలో నివాసం ఉంటున్నామని తెలిపారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణం చేపట్టినా.. ప్రభుత్వం మంజూరు చేసిన సీసీరోడ్ల పనులు ప్రారంభించినా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పంచాయతీకి ఏటా పన్నులు చెల్లిస్తున్నా అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. వేధింపులు ఆపకపోతే గ్రామంలోకి అటవీశాఖ అధికారులను రానివ్వమని హెచ్చరించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎఫ్‌ఆర్‌వో అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు.

ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఈ నెల 31 వరకు ఒప్పంద పద్ధతిన భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమెస్ట్రీ, ఫార్మకాలజీ, పాథలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్స్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, వెనరాలజీ, జనరల్ సర్జరీ, అనస్థీషియా, రెస్పిరేటరీ, మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్, ఇతర విభాగాలలో పోస్టులు తాత్కాలికంగా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

మహాసభ జయప్రదంచేయండి

ఆసిఫాబాద్‌అర్బన్: పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని, ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 17వ అఖిలభారత పద్మశాలీ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఇరుకుల అంజనేయులు కోరారు. శనివారం మహాసభలకు సంబంధించిన గోడపత్రులను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అఖిల భారత పద్మశాలీ సంఘం దేశంలోనే బలమైన సంఘంగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండా శంకర్, శ్రీకాంత్, లింగయ్య, సంజీవ్, గుండాశ్యాం, శైలేందర్, యేసయ్య, మోహన్, తిరుపతి పాల్గొన్నారు.

బస్టాండ్ కోసం నిరీక్షణ

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సిర్పూర్(టి) మండల కేంద్రం

సిర్పూర్(టి): నియోజకవర్గ కేంద్రమైన సిర్పూర్(టి)లో బస్టాండ్ నిర్మాణానికి ప్రజలు దశాబ్దాలుగా నిరీక్షిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం మీదుగా వివిధ గ్రామాల ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సిర్పూర్(టి)–కౌటాల, సిర్పూర్(టి)– మాకిడి ప్రధాన రహదారుల కూడలి వద్ద బస్టాండ్ నిర్మాణానికి 2003 సంవత్సరంలో అప్పటి ప్రజాప్రతినిధులు రూ. 5లక్షలతో నిధులు మంజూరు చేసి శిలాఫలకం వేశారు. కాని పనులు ప్రారంభం కాకపోవడంతో బస్టాండ్ నిర్మాణం పనులు నిలిచిపోయాయి. అనంతరం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ నిధులతో బస్టాండ్ నిర్మాణ స్థలంలో వ్యాపార సముదాయాల భవనం నిర్మాణం చేపట్టడంతో బస్టాండ్ నిర్మాణానికి స్థలం లేకపోవడంతో అర్థాంతరంగా నిలిచిపోయింది. గత 8 సంవత్సరాల క్రితం బస్టాండ్ నిర్మాణానికి స్థానిక బీసీ బాలుర వసతి గృహం స్థలాన్ని కేటాయించి తాత్కాలికంగా బస్టాండ్ షెడ్డు ఏర్పాటు చేశారు. పనులు ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ నేటికి బస్టాండ్ నిర్మాణం చేపట్టలేదు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందికి గురవుతున్న సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ నిర్మించాలి



మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి. బస్టాండ్ లేకపోవడంతో ప్రతీ రోజు మండల కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలి. – లక్ష్మణ్

ప్రయాణికుల ఇబ్బంది



మండల కేంద్రానికి వచ్చే మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేవు. ఇప్పటికైనా అధికారులు బస్టాండ్ నిర్మించి, వసతులు కల్పించాలి. – గణేష్

ఉపాధిపై ప్రణాళిక తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో

లింగాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, ఉపాధి కల్పనపై ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో రామచందర్, ఏపీవో చంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో, గిరిజన తండాల్లో, గూడెంలో తాగునీటి ఎద్దటి లేకుండా చూడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న కుటుంబానికి జాతీయ ఉపాధిహామీ పథకంలో పని కల్పించాలన్నారు. అలాగే నర్సరీ మొక్కలు ఎండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, ఎంపీవో రజనికాంత్, ఈసీ వినోద్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు సీసీరోడ్లు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జూర్: కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రానున్న రోజుల్లో అన్నిగ్రామాల్లో పూర్తిస్థాయిలో సీసీరోడ్లు నిర్మిస్తామని బీజేపీ నాయకులు అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని ఏటిగూడ గ్రామంలో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏటిగూడ గ్రామ ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే రోడ్డు మంజూరుకు కృషి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, ఉమ్మెర బాలకృష్ణ, గూడ రాకేశ్, నెల్లి మహేశ్, తొర్రెం జలపతి, ఇప్పకాయల శంకర్, నెల్లి పుష్ప, తునికి నాగక్క, జక్కం పద్మ, జక్కం పోశయ్య, జక్కం లింగన్న, పంబాల అశోక్ పాల్గొన్నారు.

పల్లెలను పట్టణాలుగా మార్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శుక్రవారం బెజ్జూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పట్టణాలకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్ హయాంలో పల్లెల నుంచి మొదలుకొని పట్టణాల వరకు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డులు మంజూరవుతాయన్నారు. వీటిని లబ్ధిదారులకు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ ఫలాలు అందించే విధంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగ్గా గౌడ్, శ్రీవర్ధన్, సిరిపురం సదాశివ్, శైలేష్ పాల్గొన్నారు.

బుద్ధవిహార్ బౌద్ధులకు అప్పగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: బీహార్‌లోని బుద్ధగయలోని బుద్ధ విహార్‌ను బౌద్ధులకు అప్పగించాలని ఆల్ ఇండియా బుద్ధిష్ట్ బిక్ష సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బంతె దమ్మ సారథి, నాగపూర్ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాహుల్కర్ మాట్లాడుతూ బౌద్ధుల వారసత్వ సంపద అయిన బౌద్ధ విహార్‌లో అన్యులు చొరబడి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అనంతరం స్థానిక లుంబినీ దీక్ష భూమిని సందర్శించారు. బౌద్ధ విహార్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగపూర్‌కు చెందిన బౌద్ధ మత గురువులు రాహుల్ బోధి, బంతె నబ్బాన్, దుర్గం సందీప్, జైరాం ఉప్రే, దుర్గం సునీల్ కుమార్, దుర్గం హంసరాజ్ పాల్గొన్నారు.

ఇసుక కుప్పలు సీజ్



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక

రెబ్బెన: మండలంలోని గొల్లగూడ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ రామ్మోహన్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. గొల్లగూడ సమీపంలోని రైల్వే ట్రాక్ సమీపంలో అక్రమంగా ఇసుక డంప్ చేసినట్లు అందిన సమాచారం మేరకు ఆర్ఐ ప్రేంకుమార్‌ను ఘటన స్థలానికి పంపించగా అనుమానిత ప్రాంతంలో సుమారు 20 ట్రాక్టర్ల ఇసుక లభ్యమైనట్లు పేర్కొన్నారు. దీంతో ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత..

మండలంలోని లక్ష్మీపూర్‌వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి రెబ్బెన పోలీసులు పట్టుకున్నారు. రాత్రి వేళల్లో ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై చంద్రశేఖర్ ఆదేశాల మేరకు గొల్లగూడ సమీపంలో గురువారం రాత్రి రెబ్బెన పోలీసులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అందుబాటులోకి 'జన ఔషధి'



జనరిక్ దుకాణంలో మందులు కొనుగోలు చేస్తున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్: జన ఔషధి పథకంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో జన ఔషధి జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో సీతారాం తెలిపారు. శుక్రవారం మందుల దుకాణాన్ని సందర్శించి మందులు కొనుగోలు చేశారు. ప్రజలకు తక్కువ ధరలో జనరిక్ మందులు లభిస్తాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4962 మంది విద్యార్థులకు 4727 మంది హాజరు కాగా.. 235 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రశాంతంగా డీఐఈవో కళ్యాణి తెలిపారు. కాగజ్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు.

రెబ్బెన: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షకు 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల సీఫ్ సూపరింటెండెంట్ అమరేందర్‌రెడ్డి తెలిపారు. జనరల్ గ్రూప్‌లో 234 మంది విద్యార్థులకు 230 మంది, ఒకేషనల్ గ్రూపులో 178 మందికి 168 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంగ్లీష్ పరీక్షకు 118 మంది హాజరు కావాల్సి ఉండగా అందులో 112 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. 6 గురు గైర్హాజరైనట్లు సీఎస్ గణపతి తెలిపారు.

జంపన్న గద్దె దగ్ధం

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలోని ఆడెపల్లి చౌరస్తా సమీపంలోని సమ్మక్క, సారక్క గద్దెల వద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. జంపన్న గద్దె వద్ద జంపన్న ప్రతిరూపం పూర్తిగా కాలిపోయింది. అలంకరించిన వస్త్రాలు, కర్ర కాలిబూడిదయ్యాయి. ఘటన జరిగిన తీరు అనుమానాలకు తావిస్తుండగా గ్రామంలో ఆందోళన నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో సమ్మక్క గద్దెల వద్ద మంటలు రావడాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఇంటిపన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్

కెరమెరి: ఇంటి పన్ను త్వరతిగతిన వసూలు చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏ, ఎఫ్ఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే 76 శాతం ట్యాక్సు వసూలు అయిందని, రెండు రోజుల్లో 80 శాతానికి చేరాలన్నారు. నర్సరీ పనులు 11 పంచాయతీల్లో ప్రారంభమైయ్యాయని, మిగిలిన వాటిల్లో ప్రారంభించాలని సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఉండేలా చూడాలన్నారు.

దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడీ

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: దివ్యాంగులకు ప్రస్తుతం అందిస్తున్న సదరం సర్టిఫికెట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం యూనిక్ డిజేబులిటీ ఐడీ(యూడీఐడీ)ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనపై అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. దివ్యాంగులకు ఇప్పటివరకు ఏడు కేటగిరిల్లో సదరం సర్టిఫికెట్ ఇస్తుండగా, ఇక నుంచి 21 కేటగిరిలకు సంబంధించి గుర్తింపు కార్డులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్‌డీవో దత్తారావు తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి చర్యలు

వాంకిడి: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన మండల కేంద్రంలోని కేజీబీవీలో అదనపు తరగతుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వరరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 3.25 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, మండల ప్రత్యేక అధికారి శివచరణ్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: జిల్లాలో లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం డీపీవో భిక్షపతిగౌడ్‌తో కలిసి ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్రమబద్ధీకరణ దరఖాస్తుదారుల్లో అర్హులైన వారు సుమారు 2,300 మంది ఉన్నారని తెలిపారు. ఈ నెల 31లోగా పూర్తి ఫీజు చెల్లిస్తే 25 శాతం ఫీజు రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. దరఖాస్తుదారులకు అవగాహన కల్పించి, ఫీజు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎల్ 1 నుంచి ఎల్ 2 లాగిన్‌కు పంపాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెలా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఎస్‌టీవోలలో నిలిచిన బకాయి వేతనాలు విడుదల చేయాలని, పంచాయతీల బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఒక్కపూట పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు మోరేశ్వర్, నాగేశ్, బానిత్, రాజరాం, ప్రకాశ్, శంకర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కుమురం భీం



భూమి పూజ చేస్తున్న నాయకులు

కౌటాల: ఆదర్శప్రాయుడు కుమురం భీం అని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు కుమురం మాంతయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని జనగాం గ్రామంలో కుమురం భీం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధన కోసం భీం ఎన్నలేని కృషి చేశారని గుర్తు చేశారు. భీం ఆశయాల సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మయ్య, బాపురావు, శంకర్, సుధాకర్, జుంగయ్య, రాందాస్, పత్రు, చరణ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాలు పట్టివేత



పట్టుబడిన వ్యాన్‌తో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రెబ్బెన: కౌటాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న రెండు వ్యాన్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర, కౌటాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రెండు ఐచర్ వ్యాన్లలో ఎద్దులను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా.. రెండు వ్యాన్లు, 14 ఎద్దులను పట్టుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్, కానిస్టేబుల్ రమేశ్, దేవేందర్, సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనకు సర్వే



మాట్లాడుతున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో సామర్థ్యాల పరిశీలనకు ఎఫ్ఎల్ఎన్ సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో సర్వేకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన కోసం బీఈడీ చేస్తున్న 55 మంది అభ్యర్థులకు రెండు రోజులు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు జిల్లాలో 50 ప్రభుత్వం పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో తెలుగు ఇంగ్లీష్, గణితం సబెక్టుల్లో సామర్థ్యాలను పరిశీలించి అంచనాకు వస్తారని, ఈసర్వే మొత్తం టాస్టరిన్ అనే మొబైల్ యాప్ ద్వారా జరుగుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్లు వినోద్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.